క్లుప్తంగా

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి కావలసిన పోషకాలను అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

అధ్యాపకుల ఆర్థిక సాయం



వీరయ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తొలి ఏడాది చదువుతున్న ఎం.బాలాజీ ఇటీవల ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబం పేదరికంలో ఉందన్న విషయం తెలుసుకున్న అధ్యాపక బృందం తమ వంతు సాయంగా బుధవారం రూ.22 వేలు మృతుడి తండ్రి వీరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు నరసింహులు, దేవకి, నాగేశ్వరరావు, సుజన, శ్రీనివాసులు, గాయత్రి, గౌరీ, కోటేశ్వరరావు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరం పంపిణీ



వ్యవసాయ పరికరం పంపిణీ చేస్తున్న ఏవో

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన రైతు చెన్నరాయన్‌కు ఏవో రజినికుమారి వ్యవసాయ పరికరం పంపిణీ చేశారు. బుధవారం రూ.40,290 విలువ గల నాగలిని 50శాతం రాయితీ కింద ఆయన అందజేశారు. వ్యవసాయ పనిముట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు!



మొండి బకాయిలను వసూలు చేస్తున్న కమిషనర్

పుత్తూరు: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేయనున్నట్లు కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలో బుధవారం పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించని వారి వద్దకు వెళ్లి వసూలు చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్నులపై విధించిన వడ్డీ మాఫీ చేయడం లేదని ఈ విషయాన్ని గుర్తించి ఇంటి, నీటి, ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. లేనిపక్షంలో కొళాయి కనెక్షన్లను తొలగించడంతోపాటు ఆస్తులను జప్తు చేయనున్నట్లు హెచ్చరించారు. సెలవు దినాలైన ఆదివారాల్లో సైతం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ సీడీఎంఏ వెబ్‌సైట్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చని వెల్లడించారు.

వేసవిలో పశు సంరక్షణ తప్పనిసరి

- పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- వైద్యుల సూచనలు పాటించాలి



పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

విజయపురం: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18–35 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రధానంగా వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశం ఉంటుందని, పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక మెలకువలు పాటించాలి. వేసవిలో పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది

వేసవిలో పశువులకు కావల్సిన మేత దొరకదు. దీని వల్ల పోషకాహార లోపం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీని కారణంగా గొంతువాపు, గాలికుంటు, జబ్బువాపు వ్యాధులు సోకే అవకాశముంది. దీంతో పాటు కలుషితమైన నీరు తాగడం, పశువులను కడగడం వల్ల అంతర, బాహ్యపరాన్న జీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. అంతర, బాహ్యపరాన్న జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల్యమైన పోషకాలు కలిగిన ఆహారం, పరిశుభ్రమైన నీరు తగిన మోతాదులో పశువులకు అందించాలి.

వడదెబ్బ తగలకుండా..

పశువులను మేత కోసం పొలాలు, అడవుల్లోకి తీసుకువెళతారు. వేసవిలో ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయం ఎండలో వుండడం, తాగునీరు పూర్తి స్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి వేగం బాగా పెరుగుతుంది. చెమట ఎక్కువగా పడుతుంది. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదముంది. పశువుల్లో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే చల్లని ప్రదేశానికిగానీ, షెడ్‌లోకిగానీ తీసుకు వెళ్లాలి. పశువును చల్లటి, శుభ్రమైన నీటితో కడగాలి. పశువు తాగినంత నీరు, ప్రథమ చికిత్స అందించాలి. ప్రధానంగా ఉదయం 6 గంటల నుంచి 11గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య కాలంలోనే పశువులను మేత కోసం బయటకు తీసుకు వెళ్లాలి. మిగిలిన సమయంలో పాకలో కట్టేసి మేపడం చాలా మంచిది.



మండుటెండలో మేత మేస్తున్న పశువులు

నీరు ఆహారం అధికంగా అందించాలి



వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తీసుకొని ఆహారం తక్కువగా తీసుకొంటుంది. పశువులు తాగేనీరు పుష్కలంగా, పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో ఉండేలా చూడాలి. ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పగటిపూట పచ్చగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. –శివమూర్తి, పశువైద్యాధికారి, విజయపురం

వసతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

వేసవిలో అధిక వేడి నుంచి పశువులను కాపాడుకోవడానికి మంచి వసతి ఏర్పాటు చేసుకోవాలి. పశువుల పాక ఎత్తుగా, నీరు నిలువని ప్రదేశంలో గాలి, వెలుతురు బాగా ప్రసరించే విధంగా నిర్మించుకోవాలి. సూర్యరశ్మి నేరుగా షెడ్‌లోకి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చుట్టూ చెట్లు వుండే ప్రాంతంలో పాక నిర్మించాలి. షెడ్ తూర్పు, పడమర దిశగా నిర్మించుకోవాలి. సిమెంట్ రేకులు కలిగిన షెడ్‌పై వేసవిలో 8–10 సెంటీమీటర్ల మందంగా గడ్డిని కప్పాల్సి ఉంటుంది.

బాలింతలకు పౌష్టికాహారం అవసరం

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు నిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల తెలిపారు. మండలంలోని ఎలకాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలు, ఆహార శుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు మంజూరు కాకుండానే ఇసుక డంప్



గంగాధరనెల్లూరు నుంచి దీనబంధుపురం వెళ్లే అటవీసమీపంలో డంప్ చేసిన ఇసుక

పాలసముద్రం: మండలంలో దీనబంధుపురం, శ్రీకావేరిరాజుపురం, వనదుర్గాపురంలో పనులు మంజూరు లేకుండానే కూటమి నాయకులు ఇసుక డంప్ చేసి రాత్రి సమయంలో తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మండలంలో ప్రభుత్వం సీసీ రోడ్లు పనులు మంజూరు చేసిందని అధికార పార్టీ నాయకులు ఇసుకను డంప్ చేసి రాత్రి సమయంలో తమిళనాడుకు తరలిస్తున్నారు.

దొరస్వామిరాజు కుటుంబానికి పరామర్శ





దొరస్వామిరాజుకు నివాళి అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కోదండన్ మాతృమూర్తికి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపే పంచాయతీ రాజులకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొరస్వామిరాజు కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి, తనకు చిన్ననాటి స్నేహితుడు దొరస్వామిరాజు మృతిని జీర్ణించుకోలేకపోతున్నానని తెలిపారు. తాను విదేశాల్లో ఉండడంతో ఆయన దహన క్రియలకు రాలేక పోయానని చెప్పారు. అనంతరం దొరస్వామిరాజు కుటుంబ సభ్యులను ఓదార్చి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి చందురాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తంరాజు, తదితరులు ఉన్నారు.

నివాళి

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరకనెల్లూరు కోదండన్ మాతృమూర్తి నాగమ్మ(89) అనారోగ్యంతో మృతి చెందినట్లు సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి నాగమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి నాగమ్మ కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. ఆమె కుమారుడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా అధికార ప్రతినిధిగా కోదండన్ ఎనలేని సేవలు అందించారన్నారు. అదేవిధంగా గంగాధరనెల్లూరు మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మణిరెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరై వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, గురవారెడ్డి, వెంకటరెడ్డి, రూపకుమార్‌రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి ఉన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా



కారును ప్రారంభిస్తున్న మాజీమంత్రి ఆర్కే రోజా

నగరి: పార్టీ శ్రేణులకు తానెప్పుడూ అండగా ఉంటానని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆర్కేరోజా స్పష్టం చేశారు. మండలంలోని దామరపాకం పంచాయతీ టీవీ కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గురుమూర్తి కుటుంబ పోషణకు కారును కొనుగోలు చేసుకున్నాడు. పార్టీ నేతకు ఊతమివ్వడానికి మాజీ మంత్రి వాహనాన్ని ప్రారంభించి అతనికి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి లీలారామ్, పార్టీ నేతలు చంద్రారెడ్డి, ధనశేఖర,దానియేలు, శివకుమార్, భాగ్యరాజ్, అరుణాచలం, లారెన్స్, మహేష్, ప్రేమ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా

వడమాలపేట (విజయపురం): అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబాలకు తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. మండలంలోని పూడిలో బుధవారం ఆమె ఇటీవల మృతి చెందిన గంగాధరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

ఇటుక బట్టీలపై దాడులు



పచ్చి ఇటుక తీసుకెళుతున్న ట్రాక్టర్‌ని సీజ్ చేసిన దృశ్యం

పాలసముద్రం: మండలంలోని తమిళనాడు సరిహద్దులోని దీనబంధుపురంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలను తహసీల్దార్ అరుణకుమారి తమ సిబ్బందితో కలసి బుధవారం పరిశీలించారు. సుమారు 15 నుంచి 20 ఇటుక బట్టీలు అనుమతి లేకుండా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇటుక బట్టీల నిర్వాహకులతో మాట్లాడుతూ బట్టీలు పెట్టుకునేందుకు మీకు ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఒక్కరూ కూడా అనుమతి తీసుకోలేదని.. పచ్చి ఇటుకలు తీసుకుపోతున్న ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అనుమతి లేకుండా ఇటుక బట్టీలు నిర్వహించరాదన్నారు. ఇకపై అనుమతి లేకుండా బట్టీలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓ రమణయ్య, శ్రీనివాసులు, వీఆర్‌ఏ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై మూడు వినతులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలను తెలియజేశారు. మొత్తం 3 ఫిర్యాదులు వచ్చాయని డీఈ ప్రసాద్ తెలిపారు. అందులో సంతపేట సెక్షన్ పరిధిలో మీటర్‌కు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌ను మార్పు చేయాలని వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. కొత్త సర్వీసు విడుదలపై చిత్తూరు రూరలఖ సెక్షన్ నుంచి సమస్యను తెలిపారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై మరో వినియోగదారుడు తెలుసుకొని పైకం చెల్లించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.

మాకు ఇళ్లు నిర్మించి ఇవ్వండి



క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్

పుత్తూరు: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం వద్ద జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులు తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆర్డీఓ రామ్మోహన్‌కు విన్నవించుకున్నారు. విస్తరణకు తీసుకున్న స్థలాలను బుధవారం ఆర్డీఓ రామ్మోహన్ పరిశీలించారు. పరమేశ్వరమంగళం దళితవాడ, ఆదిఆంధ్రవాడకు చెందిన 40 కుటుంబాల వారు ఇళ్లు కోల్పోవడంతో గత సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. బాధితులు తమకు ఇళ్ల స్థలాలు చూపి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆర్డీఓకు విన్నవించారు. అనంతరం ఆయన గ్రామంలో జరిగిన రీసర్వే పనులను పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

నింద్ర: పశువులకు టీకాల ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్యసేవలు పొందాలని అరూరు పశుఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. మండలంలోని అరూరులో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడం వల్ల పశువులకు వివిధ రోగాలను నయం చేయవచ్చని అన్నారు.

ఆరడుగుల కోసం అవస్థలు



విజయపురంలోని శ్మశాన స్థలం

విజయపురం: బతికి ఉన్నంతకాలం వివిధ కష్టాలు, సుఖాలు, పడటం సహజమే. మృతి చెందిన తరువాత దహన సంస్కారాలు నిర్వహించేందుకు సైతం కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఎవరైనా చనిపోతే శవం పూడ్చడానికి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరడుగుల స్థలం లేక అష్టకష్టాలు పడుతున్నారు. తవ్వినచోట ఒకటి, రెండు పుర్రెలు, అస్థి పంజరాలు బయట పడడం, గత్యంతరం లేక శవంపైనే మరో శవం పూడ్చాల్సి రావడం విషాదకరం. 300 కుటుంబాలు, 2వేలకు పైగా జనాభా కలిగిన ఈ గ్రామంలో చనిపోయిన వారిని పూడ్చడానికి శశ్మానంలో స్థలం లేక అవస్థలు పడుతున్నారు. రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు కూడా ఆరడుగుల స్థలం కోసం అష్టకష్టాలు పడుతున్నారు. శ్మశాన స్థలం కోసం పలుమార్లు అర్జీలు ఇచ్చుకున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో కొందరు తమ సొంత పొలంలో అంత్యక్రియలు చేసుకోగా, మరి కొంత మంది ఉన్న స్థలంలోనే శవంపైనే మరో శవం పూడ్చాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు



సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కార్వేటినగరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి, కంకర తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్, కంకర తరలించి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే విధంగా ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో మీకు సంబంధించిన గ్రామాల్లో మట్టిని తరలించకుండా అప్రమత్తంగా ఉంటూ అరికట్టాలన్నారు. అనంతరం వీఆర్‌ఓలు మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకుంటే తమపై తిరుగుబాటు చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా మీపై తిరగబడితే వారి వివరాలను డిప్యూటీ తహసీల్దార్‌కు అందించాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే భూకబ్జాలకు పాల్పడే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించి అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా గత రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను పరిశీలించి లబ్ధిదారులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీటీ త్యాగరాజు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఉత్తుత్తి రైతు సేవా కేంద్రాలు

- నామమాత్రంగా రైతు సేవలు
- రైతుకు అందని పెట్టుబడి భరోసా
- అందుబాటులో లేని ఎరువులు, విత్తనాలు



నగరి: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఊర్లోనే రైతుకు కావాల్సిన సేవలను చేరువ చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాలను సరఫరా చేసి రైతు ప్రభుత్వంగా పేరు తీసుకుంది. రైతులకు ఎనలేని సేవలందించిన ఆర్బీకేలు కూటమి ప్రభుత్వం హయాంలో వెలవెలబోతున్నాయని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ అందుకు తగ్గట్టుగా సేవలు మాత్రం అందడం లేదనే చెప్పాలి. నియోజకవర్గంలో 12,304 ఎకరాల సాగుభూములు ఉండగా, సుమారు 14వేల మంది రైతులు ఉన్నారు. వీరికి సేవలు అందించడానికి 58 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ సమయానికి మూడు విడతలుగా రైతు భరోసా నిధులు విడుదలయ్యేవి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎప్పటిలాగే ప్రతి విడతలో రూ.రెండు వేలు చొప్పున నిధులు విడుదల చేస్తూ వస్తోంది. ఇటీవల రైతులకు పీఎం కిసాన్ నిధులు రూ.రెండు వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. వాటితో కలిపి రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేస్తుందని రైతులు ఆశగా ఎదురు చూసినప్పటికీ నిరాశే మిగిలింది. ఎన్నికల ముందు ప్రతి ఏడాది రైతులకు రూ.20 వేలు చొప్పున నిధులు విడుదల చేస్తామని చెప్పి ఓట్లు కోసం నమ్మించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికి తోడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎలాంటి సేవలు అందడం లేదు. వీటిని నిర్వీర్యం చేసేశారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ అక్కడ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మిల్లర్లకు, దళారులకు అమ్ముకోవలసిన పరిస్థితి నెలకొంది.

భరోసా లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు కావస్తున్నా నేటికీ ఒక్క విడత కూడా రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారు. గత ప్రభుత్వం విత్తనం నుంచి ఎరువుల వరకు ఆర్‌బీకే ద్వారా సక్రమంగా అందజేసేది. –రామూర్తి, రైతు, ముడిపల్లి, నగరి మండలం

ఎరువులు, విత్తనాలు లేవు



ఇదివరలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందేవి. కూటమి ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. అయితే సేవలు మాత్రం రైతులకు అందడం లేదు. విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. –పరంధామయ్య, సర్పంచ్, మిట్టపాళెం

విడతల వారీగా అన్నింటికి అందజేస్తాం



ఇప్పటికే కొన్ని సేవా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలు అందించాం. విడతల వారిగా అన్ని కేంద్రాలల్లోను నిల్వ ఉండేలా చూస్తాం. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. త్వరలో గైడ్‌లైన్స్ వస్తుంది. దానిని అనుసరించి ధాన్యం కొనుగోలు చేస్తాం. –రాఘవేంద్రయాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

గర్భిణులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, నెలసరి వైద్య పరీక్షలు సక్రమంగా చేయించుకుంటే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహనకృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మించిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పండ్ల రసం, మజ్జిగ, నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. నెలసరి వైద్య పరీక్షలు తప్పకుండా చేసుకోవాలని తెలిపారు. గర్భిణులకు ప్రసవం వరకు ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులు, 14 మంది బాలింతలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.